# ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా

- ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం
- ఉపముఖ్యమంత్రిగా పర్వేశ్ వర్మ!
- నేడు సీఎం, మంత్రుల ప్రమాణం
- షాలిమార్‌బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రేఖా గుప్తా
- ఢిల్లీకి నాలుగో మహిళా సీఎం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. షాలిమార్‌బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేఖా గుప్తా(50)ను ముఖ్యమంత్రిగా బీజేపీ అధిష్ఠానం బుధవారం ఎంపిక చేసింది. దీంతో బీజేఎల్పీ నాయకురాలిగా ఆమెను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఆ తర్వాత రేఖా గుప్తా నేతృత్వంలోని బీజేపీ ప్రతినిధి బృందం రాజ్‌నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. సీఎం పదవికి ప్రధానంగా పోటీపడ్డ పర్వేశ్ వర్మ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలుస్తున్నది. గురువారం రామ్‌లీలా మైదానంలో సీఎంగా రేఖా గుప్తా, మంత్రులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. 26 ఏండ్ల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి రావడంతో అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. కాగా, కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ, ఆశిష్ సూద్, విజేందర్ గుప్తా వంటి వారు ముఖ్యమంత్రి రేసులో ఉన్నప్పటికీ మహిళగా రేఖా గుప్తాకు బీజేపీ అవకాశం కల్పించింది. ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రుల్లో మహిళలు ఎవరూ లేకపోవడం కూడా ఆమెకు కలిసొచ్చింది.

**ఎవరీ రేఖా గుప్తా?**

ఢిల్లీకి కాబోతున్న నాలుగో మహిళా ముఖ్యమంత్రి రేఖా గుప్తా. ఇంతకుముందు సుష్మా స్వరాజ్, షీలా దీక్షిత్, ఆతిశీ మహిళా సీఎంలుగా పని చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి బందన కుమారిపై 29 వేల ఓట్ల భారీ మెజారిటీతో షాలిమార్‌బాగ్ నుంచి రేఖా గుప్తా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎమ్మెల్యేగా ఎన్నికవడం ఆమెకు ఇదే మొదటిసారి. విద్యార్థి దశ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీలో ఆమె చురుగ్గా పని చేశారు. 1996లో ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. సౌత్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడుసార్లు కౌన్సిలర్‌గా, ఒకసారి మేయర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. 1974లో హర్యానాలోని జింద్ జిల్లా నందగఢ్ గ్రామంలో రేఖా గుప్తా జన్మించారు. ఆమె తండ్రి ఎస్బీఐ అధికారిగా ఢిల్లీకి బదిలీ కావడంతో రేఖా గుప్తా కుటుంబం ఇక్కడ స్థిరపడింది.

## మీ నాన్న సొమ్ము అడగడం లేదు

- కేంద్రంపై ఉదయనిధి ఫైర్

చెన్నై, ఫిబ్రవరి 19: కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, రాష్ట్రం పేరే బడ్జెట్‌లో లేదని తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. తామేమీ వాళ్ల(కేంద్రం) తండ్రి సొమ్ము అడగడం లేదని, తమ హక్కులనే అడుగుతున్నామని వ్యాఖ్యానించారు. జాతీయ విద్యా విధానం 2020లోని త్రిభాషా విధానానికి వ్యతిరేకంగా మంగళవారం చెన్నైలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. త్రిభాషా విధానాన్ని, హిందీ భాషను అంగీకరించకపోతే తమకు సమగ్ర శిక్షా మిషన్ కింద రావాల్సిన రూ.2,190 కోట్లను ఇవ్వబోమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్తున్నారని ఉదయనిధి ఆరోపించారు. ఇవి తమిళనాడు ప్రజలు కట్టిన పన్నుల డబ్బులని, తమకు హక్కుగా రావాల్సిన నిధులని పేర్కొన్నారు. 'ఇది ద్రవిడ నేల, పెరియార్ భూమి. బీజేపీ హెచ్చరికలు తమిళనాడులో పనిచేయవు. మేము హిందీని అంగీకరించాలని వాళ్లు(బీజేపీ) మొండిగా వ్యవహరిస్తున్నారు. తమిళులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చాలనుకుంటున్నారు. మా హక్కులను వాళ్లు గౌరవించకపోతే మరో భాషా యుద్ధాన్ని చేపట్టడానికి వెనుకాడబోం' అని హెచ్చరించారు.

## బోర్డు పరీక్షలు.. ఏడాదికి 2 సార్లు

- సీబీఎస్‌ఈ 10, 12 తరగతుల వారికి ఛాన్స్
- 2026 నుంచి నిర్వహించేందుకు సన్నాహాలు
- సీబీఎస్‌ఈ, ఎన్సీఈఆర్టీ అధికారులతో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమావేశం
- ముసాయిదాపై త్వరలో అభిప్రాయ సేకరణ



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020కి అనుగుణంగా పది, పన్నెండో తరగతి బోర్డు పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సమాయత్తమైంది. అన్నీ కుదిరితే, వచ్చే ఏడాది అంటే 2026 నుంచే ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చనున్నది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి, సీబీఎస్‌ఈ, ఎన్సీఈఆర్టీ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్వీఎస్) ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. దీనికి సంబంధించిన ముసాయిదాపై వచ్చే సోమవారం నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**ఎందుకు ఈ విధానం?**

ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షల నిర్వహణతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. తాజా విధానంతో పరీక్షల్లో ఉత్తమ స్కోరును సాధించేందుకు విద్యార్థులకు అవకాశం లభిస్తుందని విద్యాశాఖకు చెందిన అధికారులు పేర్కొన్నారు. అయితే, సెమిస్టర్ విధానాన్ని తాము పాటించట్లేదని గుర్తుచేశారు.

**రెండు పరీక్షల మధ్య నిర్ణీత వ్యవధి**

సీబీఎస్‌ఈ పది, పన్నెండో తరగతి పరీక్షలను ప్రస్తుతం ఫిబ్రవరి-మార్చిలో నిర్వహించి మేలో ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు జూలైలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లోనే ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో తమ మార్కులను మెరుగుపర్చుకోవడానికి పాసైన విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నారు. అయితే, తాజా విధానం అమల్లోకి వస్తే, అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) ప్రవేశాలపై ప్రభావం పడకుండా నూతన విద్యా క్యాలెండర్‌ను రూపొందించే అవకాశం ఉన్నదని అధికారి ఒకరు తెలిపారు. రెండు బోర్డు పరీక్షల మధ్య నిర్ణీత కాల వ్యవధి ఉంటుందని, దీంతో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు. అయితే, ఏడాదికి రెండుసార్లు నిర్వహించే ఈ బోర్డు పరీక్షలు ఎప్పుడెప్పుడు నిర్వహిస్తారన్నది త్వరలో వెల్లడిస్తామన్నారు.

**ఏ మార్కులు తీసుకొంటారు?**

ఏడాదికి రెండుసార్లు నిర్వహించే బోర్డు పరీక్షల్లో.. విద్యార్థులు ఏ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధిస్తే, వాటినే పరిగణనలోకి తీసుకొంటామని అధికారులు తెలిపారు.

**రెండుసార్లూ పరీక్షలు రాయాలా?**

ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించినప్పటికీ, విద్యార్థులు రెండుసార్లూ పరీక్షలకు హాజరవ్వడం తప్పనిసరికాదని ధర్మేంద్ర ప్రధాన్ గతంలోనే స్పష్టంచేశారు. జేఈఈ మాదిరిగా 10, 12 తరగతుల విద్యార్థులు కూడా బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరవ్వొచ్చని, అయితే అది ఐచ్ఛికమేనన్నారు.

**ఏడాది క్రితం నుంచే..**

నిజానికి 2024-25 విద్యాసంవత్సరం నుంచే ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలను నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ, సీబీఎస్‌ఈ ప్రయత్నించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. 2025-26లోనూ ఆ ప్రయత్నాలు జరిగినప్పటికీ, సాకారం కాలేదు. దీంతో వచ్చే ఏడాది నుంచి కచ్చితంగా ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

## టీనేజ్ లవ్ హక్కును కాపాడే చట్టం రావాలి

**ఢిల్లీ హైకోర్టు**

న్యూఢిల్లీ : యువతీ, యువకులకు గల ప్రేమించుకునే హక్కును పరిరక్షించే విధంగా న్యాయ వ్యవస్థ ఉండాలని ఢిల్లీ హైకోర్టు చెప్పింది. అదే సమయంలో వారి భద్రత, సంక్షేమానికి భరోసా ఉండాలని తెలిపింది. టీనేజ్ చివరి దశలో ఉన్నవారు ఇష్టపూర్వకంగా సంబంధాలు ఏర్పాటు చేసుకున్నపుడు, వారిని శిక్షించడం మీద కన్నా, అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని చెప్పింది. నిర్బంధం లేని, పరస్పర ఇష్టపూర్వకమైన సంబంధాలను అంగీకరించే చట్టం రావాలని పేర్కొంది. టీనేజ్ చివరి సంవత్సరాల్లో ఉన్నవారు పరస్పర సమ్మతితో ఏర్పాటు చేసుకునే లైంగిక సంబంధాలను లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ (పోక్సో) చట్టం ప్రకారం నేరంగా పరిగణించడాన్ని విమర్శించింది. ఇటువంటి సంబంధాలను ఏర్పాటు చేసుకునేందుకు సామాజిక, చట్టపరమైన దృక్పథాలు ఉండాలని జస్టిస్ జస్మీత్ సింగ్ చెప్పారు.

## 270 కిలోల రాడ్ మెడపై పడి.. పవర్ లిఫ్టర్ మృతి



*జైపూర్: రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. జూనియర్ నేషనల్ గేమ్స్‌లో బంగారు పతకాన్ని సాధించిన యష్టిక ఆచార్య (17) మంగళవారం జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా 270 కేజీల బరువైన రాడ్ ఆమె మెడపై పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే దవాఖానకు తరలించారు. కానీ ఆమె మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని, పోస్ట్‌మార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని వారికి బుధవారం అప్పగించామని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ట్రైనర్ కూడా స్వల్పంగా గాయపడినట్లు చెప్పారు.*

## పరిమితికి మించి టికెట్లను ఎందుకు అమ్మారు?

**ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాటపై ప్రశ్నించిన హైకోర్టు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: గత వారం న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 18 మంది మరణించిన ఘటనపై కేంద్రం, రైల్వే శాఖపై బుధవారం ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కోచ్‌ల సామర్థ్యానికి మించి రైల్వే శాఖ టికెట్లను ఎందుకు అమ్మిందని, వారిని ఏ బోగీలో కూర్చోబెడతామనుకున్నారని ప్రశ్నించింది. ఢిల్లీ ప్రమాదంపై దాఖలైన పిల్‌ను విచారించిన ధర్మాసనం ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేస్తూ ప్రస్తుతం ఉన్న చట్టాల అమలుకు మీరు ఏం చర్యలు తీసుకున్నారు? నిబంధనలు ఉల్లంఘించిన వారిలో ఎంతమందికి జరిమానా విధించారు? అని ప్రశ్నించింది. 'రద్దీ రోజుల్లో నిర్ధారిత పరిమితి కన్నా ఎక్కువ టికెట్లు అమ్మడం సమంజసంగానే ఉన్నా దానికి తగ్గట్టుగా సీట్ల సంఖ్యను పెంచాలి కదా? జారీ చేసిన టికెట్ల సంఖ్యను చూస్తే సీట్ల సామర్థ్యాన్ని మించిపోయాయి. అ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేశారు కదా' అని ప్రశ్నించింది.

## బీజేపీ గెలిస్తే కాంగ్రెస్ సంబరాలా?

**కేరళ సీఎం విజయన్ ఆగ్రహం**

తిరువనంతపురం: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే దాని విజయోత్సవం జరుపుకునే స్థాయికి కాంగ్రెస్ , రాహుల్ గాంధీ దిగజారిపోయారని కేరళ సీఎం విజయన్ విమర్శించారు. బుధవారం జరిగిన ఎస్ఎఫ్ఐ 35వ జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలుపునకు ఏమాత్రం అవకాశం లేని కాంగ్రెస్ పార్టీ బీజేపీ అధికారంలోకి రావడానికి మాత్రం సహాయం చేసిందని అన్నారు. ఢిల్లీలోని మొత్తం 70 సీట్లలో పోటీచేసిన కాంగ్రెస్ 65 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందని, అయినప్పటికీ ఆప్ అధికారం కోల్పోగానే ఆ పార్టీ ఢిల్లీలో విజయోత్సవాలు జరుపుకుందని విమర్శించారు.

## గ్లోబల్ రెప్యుటేషన్ ర్యాంకింగ్స్‌లో నాలుగు భారత విద్యాసంస్థలు

- గతంలో కన్నా మరింత దిగజారిన ర్యాంకులు
- జాబితా నుంచి ఐఐటీ బాంబే కనుమరుగు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ప్రపంచవ్యాప్త ఉత్తమ ఉన్నత విద్యాసంస్థల జాబితాలో భారత్‌కు చెందిన నాలుగు సంస్థలు చోటు దక్కించుకున్నాయి. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్‌ఈ) వరల్డ్ రెప్యుటేషన్ ర్యాంకింగ్స్- 2025 తాజాగా విడుదలయ్యాయి. అయితే ఇందులో స్థానం పొందిన నాలుగు భారత యూనివర్సిటీల ర్యాంకులు గత ఏడాది కన్నా దిగజారడం గమనార్హం. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) బెంగళూరు, 2023లో 101-125 ర్యాంకింగ్ పొందగా, ఇప్పుడది దిగజారి 201-300 శ్రేణికి చేరుకుంది. అదే స్థాయి ర్యాంకింగ్ పొందిన ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ మద్రాస్‌లకు కూడా గతంలో కన్నా ర్యాంకింగ్ తగ్గింది. ఇక 2023లో 151-175 శ్రేణిలో ర్యాంక్ పొందిన ఐఐటీ- బాంబే ఈసారి జాబితాలోనే స్థానం కోల్పోయింది. ఈసారి ఉత్తమ విద్యాసంస్థల జాబితాలో కొత్తగా శిక్ష ఓ అనుసంధాన్ చోటు దక్కించుకుంది. దీనికి 201-300 శ్రేణి ర్యాంకింగ్ దక్కింది. ఈ సంస్థ ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ప్రైవేట్ డీమ్‌డ్ టుబీ యూనివర్సిటీ. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ర్యాంకుల ప్రకారం భారత్‌లో ఐఐఎస్‌సీ బెంగళూరు మొదటి, ఐఐటీ ఢిల్లీ రెండు, ఐఐటీ మద్రాస్ మూడు, శిక్ష ఓ అనుసంధాన్ నాలుగో ర్యాంకు పొందాయి. ఇక అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ ఈ ఏడాది కూడా మొదటి ర్యాంకును నిలబెట్టుకుంది.

## యుద్ధానికి ఉక్రెయినే కారణం!

**యుద్ధాన్ని ప్రారంభించి ఉండాల్సింది కాదు: ట్రంప్**

ఫ్లోరిడా, ఫిబ్రవరి 19: రష్యా - ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా వైఖరి పూర్తిగా మారుతున్నది. ఇంతకాలం యుద్ధానికి రష్యానే కారణమని ఆరోపిస్తూ, ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న అగ్రరాజ్యం ఇప్పుడు భిన్నంగా వ్యవహరిస్తున్నది. యుద్ధానికి ఉక్రెయినే కారణమని మంగళవారం ఫ్లోరిడాలోని తన నివాసంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని ఉద్దేశించి ట్రంప్ మండిపడ్డారు. 'నువ్వు(ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ) యుద్ధాన్ని ప్రారంభించి ఉండాల్సింది కాదు. ఇందుకు బదులుగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొని ఉండాల్సింది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ యుద్ధానికి ముగింపు పలకాలని అనుకుంటున్నానని, ఇది అర్థం లేని యుద్ధమని పేర్కొన్నారు. తాను అధ్యక్షుడిగా ఉండిఉంటే అసలు యుద్ధమే జరిగి ఉండేది.

**తప్పుడు సమాచారంలో ట్రంప్**

తనపై డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఘాటుగా స్పందించారు. రష్యా వ్యాప్తి చేస్తున్న తప్పుడు సమాచారంలో ట్రంప్ జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఇండియా దగ్గర చాలా డబ్బులున్నాయి!

- మనమెందుకు ఆ దేశానికి 182 కోట్లు ఇవ్వాలి?
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు

ఫ్లోరిడా: భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ వద్దనే చాలా డబ్బులు ఉన్నాయని, ఆ దేశానికి అమెరికా ఎందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశ్నించారు. భారత్‌లో పోలింగ్ శాతాన్ని పెంచడానికి భారత ఎన్నికల సంఘానికి అమెరికా రూ.182 కోట్లు ఇచ్చిందని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ వెల్లడించిన నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. ఫ్లోరిడాలో ఆయన మాట్లాడుతూ.. 'భారత్‌లో ఓటింగ్ పెంచేందుకు మనం రూ.182 కోట్లు ఎందుకు ఇవ్వాలి? అక్కడ చాలా డబ్బులు ఉన్నాయి. మనపై అత్యధికంగా పన్నులు వేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి' అని అన్నారు. కాగా, పరస్పర సుంకాల విషయంలో తనతో ఎవరూ వాదించలేరని డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. మీరు ఎలా సుంకాలు విధిస్తే.. తామూ అలానే విధిస్తామని మోదీకి స్పష్టంగా చెప్పినట్టు తెలిపారు.

## ప్లీజ్.. హెల్ప్

- పనామా హోటల్‌లో నిర్బంధంలో ఉన్న అక్రమ వలసదారుల వేడుకోలు
- బాధితుల్లో భారతీయులు కూడా..



న్యూఢిల్లీ: అక్రమ వలసదారులను వారి సొంత దేశాలకు పంపించే ప్రక్రియలో భాగంగా 300 మందిని పనామా దేశానికి అమెరికా పంపించింది. వీరిలో భారత్ సహా పలు దేశాలకు చెందిన వారు ఉన్నారు. అక్రమ వలసదారులను పనామాలోని ఒక హోటల్‌లో నిర్బంధించారు. కాగా, తమకు సాయం చేయాలని కోరుతూ హోటల్ గది నుంచి ప్లకార్డుల ద్వారా వీరు బయటి వారిని కోరుతున్నారు. వీరిలో దాదాపు 40 శాతం మంది సొంత దేశాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తున్నది. కాగా, భారతీయ అక్రమ వలసదారులను అమెరికా నుంచి ప్రైవేటు విమానాల్లో రప్పించేందుకు విదేశాంగ శాఖ సంప్రదింపులు జరుపుతున్నది.

## గ్యారెంటీలేమన్నా నెల జీతమా?

- పథకాల డబ్బులు మూణ్నెళ్లుగా వేయకపోవడంపై ప్రశ్నించినందుకు కర్ణాటక మంత్రి కేజే జార్జి చిందులు
- ఓటర్లకు మీరిచ్చే గౌరవం ఇదేనా?
- పథకాలు కావాలని అడిగారా?
- అమలు చేయడం చేతకాక పోతే అధికారం నుంచి దిగిపోండి
- కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ ఆగ్రహం



బెంగళూరు, ఫిబ్రవరి 19: గ్యారెంటీలంటూ అలివికాని హామీలిచ్చి కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు వాటిని అమలుచేయకపోగా, ప్రశ్నిస్తున్న గొంతులపైనే విరుచుకుపడుతున్నది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో రెండు మూడు నెలల నుంచి అన్న భాగ్య, గృహలక్ష్మి పథకాలకు సంబంధించిన మొత్తాలను కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించడం లేదు. మంగళవారం చిత్రదుర్గలో మంత్రి కేజే జార్జిని మీడియా దీనిపై ప్రశ్నించింది. 'లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు ప్రతి నెలా నగదు బదిలీ చేస్తున్నాం. అప్పుడప్పుడు కొంత ఆలస్యం జరగవచ్చు. ఇదేమీ నెల జీతం కాదు, ఠంచన్‌గా ఖాతాల్లో పడటానికి' అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అమలు చేయండి.. చేతకాకపోతే దిగిపోండి**

పథక లబ్ధిదారుల పట్ల మంత్రి వైఖరిని అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత ఆర్ అశోక తప్పుబట్టారు. ఓటర్లకు మంత్రి ఇచ్చే గౌరవమిదేనా? వారు అన్న భాగ్య, గృహ లక్ష్మి గురించి మిమ్మల్ని అడుక్కోవడం లేదు. అయినా ప్రజలేమన్నా ఈ పథకాలు పెట్టమని మిమ్మల్ని ప్రాధేయ పడలేదు కదా? అని ఆయన అన్నారు. 'మీరు వాటిని అమలు చేయాలనుకుంటే గౌరవంగా అమలు చేయండి. లేకపోతే దిగిపోండి. ప్రజలు ఈ పథకాలు రాక ముందూ బతికారు, ఆ పథకాలు లేకపోయినా బతుకుతారు' అని దుయ్యబట్టారు.

## సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా సాక్ష్యాల్లేవు

- ముడా స్కామ్‌లో లోకాయుక్త క్లీన్‌చిట్
- సిద్ధరామయ్య భార్యకి సైతం..
- సీబీఐతోనే నిజాలు : బీజేపీ

బెంగళూరు, ఫిబ్రవరి 19: ముడా భూ కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య బీఎం పార్వతికి లోకాయుక్త పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు. ఈ కేసులో వీరిపై ఆరోపణలు నిరూపించేందుకు సరైన సాక్ష్యాలు లేవని పేర్కొంటూ హైకోర్టుకు తుది నివేదిక సమర్పించారు. పార్వతి నుంచి తక్కువ విలువ చేసే భూమిని సేకరించిన ముడా.. పరిహారంగా ఖరీదైన స్థలాలను అప్పగించిందనే ఆరోపణలతో ఈ కేసు నమోదైంది.

**ఊహించినట్టుగానే జరిగింది: బీజేపీ**

సిద్ధరామయ్యకు క్లీన్‌చిట్ ఇచ్చిన లోకాయుక్త పోలీసుల తీరుపై కర్ణాటక ప్రతిపక్ష నేత అశోక మండిపడ్డారు. ఇది ఊహించినదేనని, లోకాయుక్త పోలీసులకు పదోన్నతులు, పోస్టింగులు కావాలని, ఇందుకు వారు చెప్పినట్టు చేయాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. సీబీఐ విచారణతోనే నిజాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

## నలుగురు మావోల ఎన్‌కౌంటర్

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో బుధవారం పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు అదనపు ఎస్పీ విజయ్ డాబర్ తెలిపారు. సంఘటన స్థలం నుంచి ఓ ఇన్సాస్ రైఫిల్, 303 రైఫిల్, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గాయపడిన మావోయిస్టులు అడవిలోకి పారిపోయారని తెలిపారు.

## సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలు

న్యూఢిల్లీ: 26వ చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, ఎన్నికల కమిషనర్‌గా వివేక్ జోషి కూడా చార్జ్ తీసుకున్నారు. ఎన్నికల సంఘం సభ్యుడిగా కొనసాగుతున్న జ్ఞానేశ్‌కుమార్‌ను కేంద్రం సీఈసీగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. మొన్నటివరకు సీఈసీగా వ్యవహరించిన రాజీవ్‌కుమార్ మంగళవారం పదవీ విరమణ చేశారు.



## కోడి కూతపై కంప్లైంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: డబ్బు, ఇంటి సరిహద్దులపై వివాదం..పక్కపక్కనే ఇండ్లు ఉన్న కుటుంబాల మధ్య గొడవకు కారణమవుతుంటాయి. అయితే, కేరళలోని పాళ్లిక్కల్ గ్రామంలో ఓ కోడి కూత రెండు ఇండ్ల మధ్య వివాదానికి దారితీసింది. తెల్లవారుజామున 3 గంటలకు పక్కింట్లో నుంచి వచ్చే కోడి కూత..తన నిద్రకు భంగం కలిగిస్తున్నదని ఓ కేరళవాసి ఓ కోడిపై ఫిర్యాదు చేశాడు. పొద్దున్నే పదే పదే వినిపించే కోడి కూత వల్ల రాత్రిపూట నిద్ర సరిగా ఉండటం లేదని, తన ప్రశాంతత దెబ్బతింటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీనికి కారణమైన పక్కింటి యజమాని అనిల్ కుమార్ కోడిపై 'ఆదూర్ రెవెన్యూ డివిజన్' (ఆర్డీవో) కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదును ఆర్డీవో అధికారులు సీరియస్‌గా తీసుకోవటమేగాక, క్షేత్రస్థాయికి వెళ్లి దర్యాప్తు సైతం చేశారు. కోడి, దాని కోడి పిల్లల గూడును ఇంట్లోనే మరొక చోటకు మార్చాలని అధికారులు సూచించారు.



## సమాధులపై అంతుచిక్కని స్టిక్కర్లు

బెర్లిన్, ఫిబ్రవరి 19: జర్మన్ దేశ పోలీసులకు ఇప్పుడో కొత్త కేసు సవాల్‌గా మారింది. ఆ దేశంలోని మ్యూనిచ్ నగరంలోని మూడు శ్మశాన వాటికల్లో వేలాది సమాధుల శిలా ఫలకాలు, చెక్క శిలువలపై గుర్తు తెలియని వ్యక్తులు స్టిక్కర్లు అతికించారు. వాటిపై ఎలాంటి గుర్తులు, బొమ్మలు, సూచనలు, నినాదాలు లేకపోవడంతో వాటిని ఎవరు, ఎందుకు ఉంచారో తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. పౌరులను భయపెట్టడానికి ఎవరన్నా ఇలా చేశారా? అన్న కోణంలో కూడా పోలీసులు యోచించారు. 5x3.5 సెంటీమీటర్ల సైజులో ఉన్న ఆ స్టిక్కర్లపై ఒక క్యూఆర్ కోడ్ కూడా ఉంది. అయితే దానిని స్కాన్ చేసి చూస్తే ఆ సమాధి ఎవరిది, శ్మశానంలో సమాధి లొకేషన్ వివరాలు మాత్రమే వస్తున్నాయి. ఈ స్టిక్కర్లు అంటించిన వారి గురించి తెలిస్తే వెంటనే తమను సంప్రదించాలని పోలీస్ అధికారి క్రిస్టియన్ డ్రెక్లెర్ పౌరులకు విజ్ఞప్తి చేశారు.

## ముంబై, కోల్‌కతాపై ఆస్టరాయిడ్!

- *భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలం*
- *'సిటీ కిల్లర్'గా గుర్తించిన ఖగోళ శాస్త్రవేత్తలు*
- *రిస్క్ కారిడార్‌లో 7 ప్రధాన నగరాలు*
- *ఢీకొనే అవకాశాలు 3.1% పెరుగుదల*
- *గ్రహశకలం దిశను గమనిస్తున్న నాసా*



*న్యూయార్క్, ఫిబ్రవరి 19: అంతరిక్షంలో గతితప్పి దూసుకొస్తున్న '2024 వైఆర్4' అనే గ్రహశకలం భూమిని ఢీకొనే అవకాశాలు మరింతగా పెరిగాయి. ఆ ఆస్టరాయిడ్ గమనం ప్రకారం.. భూమిని ఢీకొట్టే అవకాశం 3.1 శాతం పెరిగింది. ఈ ఆస్టరాయిడ్ ఢీకొనే అవకాశమున్న రిస్క్ కారిడార్‌లో తూర్పు పసిఫిక్ మహాసముద్రం, దక్షిణ అమెరికాలోని ఉత్తరభాగం, అట్లాంటిక్ మహాసముద్రం, అరేబియా సముద్రం, దక్షిణాసియా తదితర ప్రాంతాలు ఉన్నాయి. ముంబై, కోల్‌కతా, ఢాకా, బొగొటా, అబిడ్జాన్, లాగోస్, ఖార్టూమ్ లాంటి ఏడు ప్రధాన నగరాలు ఇందులో ఉండటం ఆందోళనకరం. ఈ నగరాల్లో సుమారు 110 మిలియన్ల మంది నివసిస్తున్నారు.*

***రిస్క్ జాబితాలో చోటు***

*ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్ వార్నింగ్ నెట్‌వర్క్ నేతృత్వంలో భూమిపై నుంచి టెలిస్కోప్ ద్వారా చేస్తున్న పరిశీలనల ద్వారా ఇది ఏప్రిల్ వరకు కనిపిస్తుంది. ఆ తర్వాత 2028 జూన్ వరకు కనిపించకుండాపోయే అవకాశం ఉంది. 'ఇది భూమిని ఢీకొట్టే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నప్పటికీ.. 2032 డిసెంబర్ 22 నాటికి మరో 2.3 శాతం పెరిగే అవకాశం ఉంది. గతంలోనూ ఇలాంటి ఎన్నో ఖగోళ వస్తువులు కనిపించాయి. ఆ తర్వాత రిస్క్ లిస్ట్ నుంచి తొలగిపోయాయి' అని ఫిబ్రవరి 7న తన నివేదికలో నాసా తెలిపింది.*

***ప్రమాదం తొలగేనా?***

*ఈ ఆస్టరాయిడ్‌ను 2024 డిసెంబర్ 24న ఖగోళ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. డిసెంబర్ 31న నాసా రిస్క్ లిస్ట్‌లో చోటు దక్కించుకున్న తర్వాత దీనిపై ఖగోళ శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. ప్రకాశం (బ్రైట్‌నెస్) ఆధారంగా దాని పరిమాణం 130-300 అడుగుల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇది భూమిని ఢీకొట్టకపోతే అంతరిక్షంలోనే 8 మెగాటన్నుల టీఎన్‌టీ శక్తితో పేలిపోయే ఆస్కారముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. హిరోషిమాపై ప్రయోగించిన బాంబు కంటే 500 రెట్లు ఎక్కువ శక్తి కలిగిన ఇది అత్యంత బలమైన అంతరిక్ష శిలగా గుర్తింపు పొందింది. 2024 వైఆర్4 గ్రహశకలం సిటీ కిల్లర్‌గా గుర్తింపు పొందింది. భూగ్రహానికి ప్రమాదకారి కానప్పటికీ, ఒక నగరాన్ని తుడిచిపెట్టే సామర్థ్యం దీనికి ఉంది. అయితే, ఈ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టేందుకు 2.3 శాతం మాత్రమే అవకాశాలు ఉన్నట్టు గతంలో నాసా అంచనా వేసింది.*



## దోమల్ని పట్టిస్తే డబ్బులు

మనీలా, ఫిబ్రవరి 19: డెంగ్యూపై పోరాటంలో భాగంగా అడిషన్ హిల్స్ అనే ఓ ఫిలిప్పీన్స్ పట్టణం దోమలపై దండయాత్ర మొదలుపెట్టింది. ఇందులో ప్రజలను భాగస్వాములను చేసేందుకు వింత ప్రకటన చేసింది. దోమలను పట్టుకుంటే నజరానా ఇస్తామని ప్రకటించింది. దోమలను ప్రాణంతో పట్టుకున్నా లేదా చంపినా డబ్బులు ఇస్తామని చెప్పింది. ఈ పట్టణానికి సమీపంలోని క్వేజాన్ నగరంలో దోమల కారణంగా డెంగ్యూ కేసులు పెరిగిన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకుంది. ఐదు దోమలు లేదా లార్వాకు రూపాయిన్నర (ఫిలిప్పీన్స్ కరెన్సీలో ఒక పెసో) చొప్పున నజరానా ఇస్తామని పట్టణ నాయకుడు కార్లిటో కెర్నల్ ప్రకటించారు. ఈ ప్రకటనతో పౌరులు అప్రమత్తమయ్యారు. దోమలను ప్రాణాలతో పట్టుకోవడం సాధ్యం కాదు కానీ, వాటిని చంపేద్దాం అంటూ దోమల బ్యాట్‌లతో యుద్ధానికి సిద్ధమయ్యారు.




మితిమీరిన యాడ్‌లతో సినిమా ఆలస్యం..

## పీవీఆర్ ఐనాక్స్‌కు లక్ష జరిమానా

బెంగళూరు: పరిమితికి మించి ప్రకటనలు వేయడమే కాక, నిర్దేశిత సమయంలో సినిమాను ప్రారంభించకుండా ప్రేక్షకులను విసిగించిన బెంగళూరులోని పీవీఆర్ ఐనాక్స్ థియేటర్‌కు వినియోగదారుల న్యాయస్థానం లక్ష రూపాయల జరిమానా విధించింది. ఇక నుంచి సినిమాను ప్రారంభించే కచ్చితమైన సమయాన్ని ప్రేక్షకులకు తెలియజేయాలని ఆదేశించింది. కేసు వివరాల్లోకి వెళితే.. బెంగళూరు నివాసి ఒకరు 2023 డిసెంబర్‌లో పీవీఆర్ ఐనాక్స్ థియేటర్‌లో సినిమా చూడటానికి తన కుటుంబంతో కలిసి వెళ్లాడు. సినిమాను 4.05 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా, సుదీర్ఘంగా ప్రకటనలు వేసి, విసిగించి 4.30కు ప్రారంభించారు. దీనిపై అతడు వినియోగదారుల కోర్టును ఆశ్రయించగా, థియేటర్‌కు లక్ష జరిమానా విధించింది. ఫిర్యాదుదారుకు 20 వేలు, కోర్టు ఖర్చులకు 8 వేలు ఇవ్వాలని ఆదేశించింది.